

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ) సా.6.21
సహరి (గురు) ఉ.4.51



కుర్చీలు లేక కటిక నేలపైనే కూర్చున్న మహిళలు



ఎమ్మెల్యే ప్రసంగిస్తున్న సమయంలో వెనుదిరుగుతున్న లబ్ధిదారులు



సభా ప్రాంగణంలో నిలుచుని ఉన్న లబ్ధిదారులు

ఇలా గేనా 'చేయూత'!

ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 'చేయూత' చెక్కుల పంపిణీ సభకు అధిక సంఖ్యలో లబ్ధిదారులు తరలివచ్చారు. అయితే కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేకపోవడంతో కొందరు నిలుచుని ఉండగా మరికొందరు నేలపై కూర్చోవాల్సి వచ్చింది.

ఎమ్మెల్యే ప్రసంగం జరుగుతుండగానే లబ్ధిదారుల్లో కొంత మంది భోజనాలకు, ఇంకొంతమంది బయటకు వెళ్లిపోవడం కనిపించింది. యానిమేటర్లు, వలంటీర్లకు టార్గెట్లు అప్పగించడంతో ఆటోలు, ఇతర వాహనాల్లో లబ్ధిదారులను తీసుకొచ్చారు. వారు ముందురోజే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సభకు రాకపోతే చేయూత సొమ్ములు బ్యాంకు ఖాతాలో పడవని హెచ్చరించారు. యానిమేటర్లు, వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు జనాలను తరలించడం కనిపించింది. సభ ముగిసిన తర్వాత యానిమేటర్లు, వలంటీర్ల వద్దకు లబ్ధిదారులు వెళ్లి హాజరు వేయించుకున్నారు.

... ముమ్మిడివరం

టీడీపీ సానుభూతిపరురాలంటూ 'చేయూత'లో కోత

నాలుగో విడత అందకుండా చేశారని వెంకటలక్ష్మి ఆవేదన



భర్త సూర్యనారాయణతో వెంకటలక్ష్మి

కె.గంగవరం, మార్చి 12: 'సంక్షేమ పథకాలు అమలులో మేం పార్టీ చూడం, మతం చూడం, వర్గం చూడం... అర్హత ఉంటే నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులు జమ చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి జగన్ పదేపదే చెప్తుంటారు. కానీ మండలంలోని కుందూరుకు చెందిన ఒక ఎస్సీ మహిళను టీడీపీ సానుభూతిపరురాలు అంటూ 'చేయూత'లో చేయిచ్చారు. కుందూరు ఎస్సీ కాలనీకి చెందిన తాడి వెంకటలక్ష్మి నిరుపేద. చేయూత పథకంలో లబ్ధిదారురాలు. ఆమె భర్త సూర్యనారాయణ ఇటీవల టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. దీనిని గమనించిన వైసీపీ నాయకులు వెంకటలక్ష్మికి 'చేయూత' నాలుగో విడత లబ్ధి రాకుండా చేశారు. వెంకటలక్ష్మి కుటుంబానికి రెండు విద్యుత్ మీటర్లు ఉన్నాయి. ఇప్పుడు మండపేటలో మరో నాలుగు మీటర్లు చూపిస్తున్నాయంటూ 'చేయూత'లో కోత విధించారు. తాము టీడీపీకి మద్దతుగా ఉన్నామనే కారణంతోనే చేయూత రాకుండా వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని వెంకటలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు వాపోయారు.

పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి: కలెక్టర్

అమలాపురం టౌన్, మార్చి 12: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. పరీక్షలు ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని, వివిధ విభాగాల నుంచి అధికారులకు విధులు కేటాయించామన్నారు. పదో తరగతి పరీక్షలకు ఐదు పరీక్షా కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు 17కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల తరలింపునకు సెక్యూరిటీని ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా నియమించారు. 22 కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అధికారులను సమన్వయం చేసుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు.



కలెక్టరేట్‌లో వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యేలు సతీష్, చిట్టిబాబు

జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు రూ.161.86 కోట్లు పరిహారం

అమలాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ పైపులైను డ్రిల్లింగ్ పనుల ద్వారా మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుండడంతో ప్రభుత్వం పరిహారం చెల్లిస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు వరుసగా ఐదో విడత పరిహారంగా కాకినాడ, కోనసీమ జిల్లాలకు సంబంధించి 23,458 మందికి రూ.161.86 కోట్లను వర్చువల్ విధానంలో మంగళవారం సీఎం జగన్ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లో వర్చువల్ సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు సముద్ర తీర మండలాలకు చెందిన 16,408 మత్స్యకార కుటుంబాలకు రూ.113 కోట్ల మేర నిధులు చెల్లించామన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

- ఓడిపోయే వ్యక్తికి సీటు ఎలా ఇస్తారు
- వైసీపీ ఆవిర్భావ దినోత్సవంలో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త రాపాక సంచలన వ్యాఖ్యలు
- అధిష్ఠానం పోటీ చేయమంటే చేస్తా లేదా పార్టీ కోసం పని చేస్తానని వెల్లడి
- మరోపక్క వరప్రసాదరావుకే రాజోలు సీటు కేటాయించాలంటూ కార్యకర్తల నినాదాలు

రాజోలు రగడ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీలో అమలాపురం లోక్‌సభ, రాజోలు అసెంబ్లీ సమన్వయకర్తల మధ్య తలెత్తిన సీట్ల వివాదం రోడ్డెక్కింది. గత కొన్ని రోజులుగా వారి మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో పాటు వైసీపీ శ్రేణులు రోజుకో ప్రాంతంలో ఆందోళనకు దిగుతూ ఈ వివాదాన్ని మరింత రక్తికట్టిస్తున్నారు. రాజోలు ఎమ్మెల్యేరాపాక వరప్రసాదరావును వైసీపీ అధిష్ఠానం ఇటీవల అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. అయితే ఆయన తనకు లోక్‌సభకు వెళ్లే ఉద్దేశ్యం లేనట్టు మంగళవారం మలికిపురంలో జరిగిన వైసీపీ ఆవిర్భావ దినోత్సవ సభలో పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. రాజోలు అసెంబ్లీ స్థానంలో ఓడిపోయే వ్యక్తికి సీఎం జగన్ అవకాశం కల్పించడం వల్ల మూడోసారి కూడా ఇక్కడ పార్టీ నెగ్గుకొచ్చే పరిస్థితులు లేవని బహిరంగంగానేస్పష్టత ఇచ్చేశారు. రాపాక అనుచరగణమైతే రాజోలు గడ్డ-రాపాక అడ్డా.. ఆయన్నే అసెంబ్లీ అభ్యర్థిగా బరిలోకి దింపాలని దివంగత నేత వైఎస్సార్ విగ్రహం సాక్షిగా ఆందోళనకు దిగారు. రాపాక సైతం తన ప్రసంగంలో... ఇటీవల టీడీపీ నుంచి వైసీపీలో చేరి రాజోలు అసెంబ్లీ సమన్వయకర్తగా నియమితులైన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేరును ప్రస్తావించకుండానే ఆయనపై పరుషమైన వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పటికే రెండుసార్లు వైసీపీ కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోలేక నష్టపోయారు... మూడోసారి కూడా అదే పునరావృతం కానుంది. ఇక్కడ టిక్కెట్ ఇచ్చిన అభ్యర్థి ఓటమి తథ్యం, మరోసారి సర్వే చేయించి గెలిచే వ్యక్తికి టిక్కట్టు ఇవ్వమని సీఎం జగన్‌ను అభ్యర్థిస్తున్నాను. నాకే ఇమ్మని చెప్పను. ఎవరిని తీసుకువచ్చి నిలబెట్టినా గెలిచే సత్తా ఉన్నవాడికే టిక్కెట్టు ఇవ్వాలన్నదే నా అభిమతం.. నాకు ఎంపీ టిక్కెట్ ఇచ్చినా ఒకే... ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే సంతోషంగా వెళతాను. లేదా పార్టీలోనే ఉండి సేవ చేయమని కోరిన సీఎం జగన్ మాట శిరసా వహిస్తాను. రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు సీఎంగా జగన్‌ను చూసేందుకు కృషి చేస్తాను' అంటూ రాపాక వరప్రసాదరావు చేసిన ప్రకటన సంచలనమైంది. అయితే లోక్‌సభకు పోటీ చేసే పరిస్థితులు లేవంటూ చేతులెత్తేశారని వైసీపీ వర్గీయులు స్పష్టత ఇస్తున్నారు. తాజా పరిణామాలపై గొల్లపల్లి సూర్యారావు, ఆయన వర్గీయులు మాత్రం మౌనంగా ఉన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం... ఇలా రోజుకో మండలంలో రాపాకకు మద్దతుగా వైసీపీ వర్గీయులు ఆందోళనకు దిగుతున్న పరిణామాలు ఆ పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారాయి. రాపాక రాజోలు అసెంబ్లీ స్థానంపై ఆశలు పెంచుకోవడంతో పాటు కేడర్ ద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. జనసేన తరపున నెగ్గి వైసీపీలో చేరి సీఎం జగన్ ఆదేశాలతో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాటు పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించిన తనను, తన వర్గాన్ని పార్టీ పట్టించుకోవాల్సిందేనంటూ రాపాక సహా ఆయన వర్గీయులు భీష్మించారు. రాజోలు టిక్కెట్టు వ్యవహారం రచ్చరచ్చగా మారుతున్న వైనాన్ని రాజకీయ పరిశీలకులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

'రాజోలు అభ్యర్థిపై పునరాలోచించాలి'

మలికిపురం, మార్చి 12:

రాజోలు సీటు విషయంలో ముఖ్యమంత్రి జగన్ పునరాలోచన చేయాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. మలికిపురం సెంటర్లో మంగళవారం జరిగిన వైసీపీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజోలులో వైసీపీ నెగ్గాలని, జగనే మరలా సీఎం కావాలనే ఆకాంక్షతో నియోజకవర్గ ప్రజలు ఉన్నారని, వారి ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోకపోతే మరోసారి అపజయం మూట కట్టుకోవాల్సి వస్తుందన్నారు. రెండు పర్యాయాలు ఓటమిని చవిచూసిన వైసీపీ శ్రేణులు ఈసారి విజయం సాధించాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. మరలా సర్వే చేయించి గెలిచే అభ్యర్థికి టిక్కెట్ కేటాయించాలని, వారి విజయానికి తాను కృషి చేస్తానన్నారు. రాజోలులో ప్రస్తుతం ప్రకటించిన అభ్యర్థి ఓటమి చెందుతారని, తానైతేనే విజయం సాధిస్తానన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజోలు అసెంబ్లీ అభ్యర్థిగా రాపాక వరప్రసారావుకే అవకాశం కల్పించాలని చింతలమోరికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మలికిపురం గాంధీ బొమ్మ కూడలిలో నినాదాలు చేశారు. మరోవైపు పలువురు సోషల్ మీడియా పదవులకు, బూత్ కమిటీ పదవులకు రాజీనామా చేశారు.

జపాన్‌లో ఏఎన్‌ఎంలుగా...

పనిచేసేందుకు ఆసక్తి ఉంటే శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం

అమలాపురం టౌన్, మార్చి 12: జపాన్‌లో ఏఎన్ఎంలుగా పని చేసేందుకు ఆసక్తి ఉంటే భాషతో పాటు ఇతర శిక్షణ పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాష, ఎన్ 5, 4, 3 స్థాయిల్లో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తారు. 32 ఏళ్లలోపు ఉండి జపాన్‌లో పని చేసేందుకు ఆసక్తి గలవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నావిస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు బెంగళూరులో శిక్షణ ఇస్తారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షలు. దీనిని మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలు. దాంట్లో రూ.25వేలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుంది. శిక్షణ పూర్తిచేసిన వారికి జపాన్‌లో ఉద్యోగ అవకాశం కల్పించడానికి కావాల్సిన సదుపాయాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చేపడుతుంది. వేతనం కింద నెలకు రూ.1.10లక్షల నుంచి రూ.1.40లక్షల వరకు చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు 9581422339 నెంబరులో సంప్రదించాలి.

భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టు పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, మార్చి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండల భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఐదు ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు మంగళవారం తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సులు పూర్తిచేసిన అర్హులైన అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.12వేలు గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



రైతు బజారులో తనిఖీ చేస్తున్న సుధాకర్

వినియోగదారులు మోసపోకుండా చూస్తాం

తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి జిల్లా అధికారి సుధాకర్

మండపేట, మార్చి 12: వినియోగదారులు తూనికలు, కొలతల విషయంలో జరిగే మోసాలకు బలికాకుండా ఉండేందుకు వారితో పాటు వ్యాపారులకు కూడా అవగాహన కల్పిస్తున్నామని తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి జిల్లా అధికారి సుధాకర్ చెప్పారు. పట్టణంలోని రైతు బజారును మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వ్యాపారులు వినియోగిస్తున్న ఎలక్ట్రిక్ కాటాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తూకాల్లో తేడాలను గుర్తించి సరి చేశారు. తూకాలు, కొలతల్లో వినియోగదారులకు నష్టం కలగకుండా చూడడమే తమ శాఖ లక్ష్యమన్నారు. అనంతరం పట్టణంలో పలు దుకాణాల్లో కూడా తనిఖీలు చేశారు. ఆయన వెంట తూనికలు, కొలతల శాఖ డీఎస్పీ రాజేష్‌కుమార్, సీఐ కుటుంబరావు, సిబ్బంది వున్నారు.



ఊరేగింపులో ఆకట్టుకున్న హనుమాన్ వేషధారణ

వైభవంగా వీరేశ్వరస్వామి రథోత్సవం, తెప్పోత్సవం

మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం ఉదయం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులైన వీరేశ్వరస్వామి, అమ్మవారు వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. వీరేశ్వరస్వామి వృద్ధ గౌతమిలో నదీ విహారం చేశారు. భక్తులు శివనామస్మరణతో పులకించారు. అనంతరం గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు ....7లో



వ్యవసాయ పథకాల అమలుకు

పంట కోత ప్రయోగాలే కీలకం

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు

ముమ్మిడివరం, మార్చి 12: ఫసల్ బీమా యోజన, క్రాప్ ఇన్సూరెన్సు అమలుకు పంట కోత ప్రయోగాలు ఎంతో కీలకమని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోనిజిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏడీ ఎండీ రామారావు అధ్యక్షతన మంగళవారం ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. బోసుబాబు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆహార ధాన్యాల ఉత్పత్తిని అంచనా వేయడంలో పంటకోత ప్రయోగం ఎంతో ముఖ్యమైందన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే పంట కోత ప్రయోగాలను బట్టే ఆయా పథకాలు అమలు జరుగుతాయన్నారు. క్షేత్రస్థాయిలో పంటకోత ప్రయోగం ఎలా నిర్వహించాలని, సర్వే నంబరు ఎంపిక, సర్వే నంబరు సబ్ డివిజన్ ఎంపిక, పొలం ఎంపిక తదితర అంశాలను శాస్త్రీయ దృక్పథంతో చేపట్టాలన్నారు. మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ పంటకోత ప్రయోగాలపై పూర్తి అవగాహన ఏర్పరుచుకుని వాటిని నిర్వహించాలన్నారు. రబీ సీజనుకు సంబంధించి పంట కోత ప్రయోగాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డివిజనల్ డిప్యూటీ స్టాటస్టికల్ ఆఫీసర్లు డి.ప్రభాకరరావు, ఎ.ప్రభుదాసు, మండల వ్యవసాయాధికారులు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఎం.వాణి, కె.ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌వోలు డి.బాలశ్రీనివాస్, కేఎల్ఎం శాస్త్రి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న బోసుబాబు

ఏపీఈఏపీసెట్ -2024కు

దరఖాస్తుల స్వీకరణ

● ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు



జేఎన్టీయూకే, మార్చి12: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్,అగ్రికల్చర్, ఫార్మసీకామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్) -2024 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసినట్లు ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను మంగళవారం నుంచి స్వీకరిస్తున్నామన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే13 నుంచి 19 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తామని ఏపీలో 47, హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్, సికింద్రాబాద్‌లలో రెండు కేంద్రాలు, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. https://cets/apsche.ap.gov.in/ EAPCET_HomePage. aspx లింక్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను పూరించాలన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించి మే13 నుంచి 16 వరకూ, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మే17 నుంచి 19 వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రూ.500 అపరాధరుసుముతో ఏప్రిల్ 30వరకూ, రూ.1000తో మే 5వరకూ, రూ.5000 అపరాధ రుసుముతో మే10, రూ.10,000 అపరాధరుసుముతో మే12 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షలను ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డితెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 08842359599, 2342499 లో సంప్రదించాలని సూచించారు.

జాబ్ ఫెస్ట్‌లతో

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ శోభారాణి



జాబ్ ఫెస్ట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శోభారాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12 : విద్యార్థులకు డిగ్రీ పట్టాను అందించడమే కాకుండా వారిని ఉద్యోగస్థులుగా చేసి పంపించాలనే లక్ష్యంతో జాబ్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు జోన్ -1, జోన్- 2 కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ బి.శోభారాణి చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాబ్‌ఫెస్ట్-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ జాబ్‌ఫెస్ట్‌కు 10 నోడల్ రిసోర్సు సెంటర్ల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, ఐటీ మొదలైన రంగాలకు చెందిన 24 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. 269 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ, నోడల్ రిసోర్సు సెంటర్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ ఫెస్ట్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆది' నుంచీ వివాదాస్పదమే!

● పోలవరం ప్రాజెక్టు పాలకుడిగా, స్పెషల్ కలెక్టరుగా నిర్వాసితులకు ఒరిగింది శూన్యం

రంపచోడవరం, మార్చి 12 : ఆయన ఓ అఖిల భారత సర్వీసుల అధికారి. ప్రభుత్వ నిబంధనల మేరకు రాగద్వేషాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం అందరినీ గౌరవిస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రజాసేవకుడిగా మంచి పేరు తెచ్చుకోవాల్సిన ఆయన వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీవీ ప్రవీణ్ ఆదిత్యను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సోమవారం పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మూడున్నరేళ్లకుపైగా పనిచేసిన ఆయనను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా నియమించారు. దీంతో అక్కడి జనసేన పార్టీ నాయకులు నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఈ విషయాన్ని ఫిర్యాదుచేశారు. ఈయన నియామకం ద్వారా ఎన్నికల సమయంలో ఆయన్ను అనుకూలంగా వాడుకోవాలని ప్రణాళిక వేసినట్టు జనసేన ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడింది. వాస్తవానికి ప్రవీణ్ ఆదిత్య పూర్తిగా వైసీపీ అనుకూల అధికారిగా ఎప్పటినుంచో ముద్రపడింది. రంపచోడవరం సబ్ కలెక్టరుగా ప్రస్థానాన్ని మొదలు పెట్టి, తర్వాత రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పదోన్నతి పొంది, తర్వాత కాలంలో జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు పరిపాలకుడిగా చేరి, భూసేకరణకు స్పెషల్ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అయా సమయాల్లో కూడా వివాదాస్పద వైఖరినే అవలంభించారనే ఆరోపణలు వచ్చాయి. జాతీయ హోదాతో ఉన్న పోలవరం ప్రాజెక్టుకు పాలకుడిగా వ్యవహరించిన కాలంలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసాన్ని కల్పించకుండా గ్రామాలను ఖాళీ చేయించి ప్రభుత్వ మెప్పు పొందడానికి తాపత్రయపడ్డారని పెద్దఎత్తున విమర్శలు వచ్చా యి. గిరిజన నిర్వాసితులకు భూమికి బదులుగా భూమిని సమకూర్చకుండానే గ్రామాలను ఖాళీ చేయించిన వైనం, పునరావాసం కోసం భూములను సేకరించే ప్రక్రియ చేపట్టి వారి నుంచి అప్పనంగానే భూములను కాజేసి మెప్పు పొందే క్రమంలో భూయజమానులపై తప్పుడు కేసులు బనాయించడం, గిరిజనేతర నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించకుండానే వారిని మైదాన ప్రాంతాలకు తరలించడమే కాకుండా వారి ఓట్లు మైదాన ప్రాంతానికి తరలిపోయే పరిస్థితికి కారణమయ్యారని ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇప్పటికే పునరావాస వైఫల్యాలపై ఎన్నో ఉద్యమాలు, కోర్టు కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఇక రంపచోడవరం ఐటీడీఏలో విధులు నిర్వర్తిస్తున్న కాలంలో తెలుగుదేశానికి చెందిన ఓ గిరిజన మహిళా మాజీ ఎమ్మెల్యేను కింద కూర్చోబెట్టడం, ముఖ్యమంత్రి మెచ్చిన ఓ దివ్యాంగుడైన ఉత్తమ అధికారిని సైతం దూషించి అవమానించడం వంటి తీరు ఆయనను వివాదాస్పదుడిగా చూపుతున్నా ప్రభుత్వం ఆయనకు అండగా నిలిచింది. ఆ కారణంగానే మూడున్నరేళ్లకుపైగా ఈయన ఒకే జిల్లాలో కొనసాగారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు.

చోరీలకు పాల్పడుతున్న

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

పిఠాపురం, మార్చి 12: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను కాకినాడజిల్లాలో పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్‌లు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామానికి చెందిన పలకా అశోక్‌కుమార్ కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో కలెక్షన్ చేయగా వచ్చిన మొత్తం రూ.1.80లక్షలను మోటార్‌సైకిల్ డిక్కీలో పెట్టుకుని మెయిన్‌రోడ్డులో గల వరలక్ష్మి కట్‌పీసెస్ షాపువద్ద పార్కుచేసి మేడమీదకు వెళ్లి వచ్చి చూసుకునే సరికి డిక్కీ తెరిచి ఉండగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మార్చి 1వ తేదీన జరిగిన ఈ సంఘటనపై కేసు నమోదుచేసి కాకినాడ ఐటీ కోర్ టీమ్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలోని క్రైమ్ సిబ్బంది అందించిన సహకారంతో అడిషనల్ ఎస్ఐ వెంకటేష్ నిందితులను గుర్తించారు. మంగళవారం జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాకిరెడ్డి కృష్ణ(బాలకృష్ణ), మేకల హరికిరణ్(పండు)లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.1.04లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో గండేపల్లి, గొల్లప్రోలు, ఏలేశ్వరం పోలీసుస్టేషన్లతోపాటు తెలంగాణాలోని మహబూబాబాద్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

బంగారు వస్తువులు

దొంగిలించిన యువకుల అరెస్టు



బంగారు గొలుసు దొంగల చాయాచిత్రం

ముమ్మిడివరం, మార్చి 12: మహిళ మెడలో బంగారు గొలుసును దొంగిలించుకుపోయిన ఇద్దరు యువకులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. గత నెల 28న బందరుపాలేనికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంక వివాహ కార్యక్రమానికి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిరీక్షిస్తుండగా మోటారుసైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. మహిళ ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా గాలించగా కాట్రేనికోన మండలం గచ్చకాయలపొరకు చెందిన పొన్నమండ సుబ్బరాజు, గాడి శివనాగరాజులుగా గుర్తించి వారిని ముమ్మిడివరం ల్యాంపు కళాశాల సమీపంలో మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

నేడు భీమేశ్వరాయంలో హుండీల లెక్కింపు

సామర్లకోట, మార్చి 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం భక్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 6నుంచి సోమవారంరాత్రి వరకూ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు హుండీల ద్వారా వేసిన కానుకలు, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాలను బుధవారం లెక్కించనున్నట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

యానాం, మార్చి 12: యానాం నియోజకవర్గంలో ఒక గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కిడ్నాప్, బాల్య వివాహచట్టం, పోక్సో చట్టం కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మురుగానందం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న బాలికను తిరుపతి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. తర్వాత వారు కాకినాడ చేరుకోగా అదుపులోకి తీసుకుని యానాం తీసుకువచ్చి వైద్యపరీక్షలు జరిపించి, పోక్సో తదితర సెక్షన్లకింద యువకుడిపై కేసు నమోదు చేశారు. యానాం సబ్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించా రు. మంగళవారం పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలుకు తరలించారు.

విధుల్లో పోలీసులు అప్రమత్తత

● ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లు సురక్షితం

● రూ.81 వేల నగదుతో అప్పగింత

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులో రెండు బ్యాగులను మరిచిపోయి వెళ్లిపోయిన ప్రయాణికుడికి టూటౌన్ పోలీసులు సురక్షితంగా వాటిని అందజేశారు. కపిలేశ్వరపురానికి చెందిన ఏడ్నూతుల వెంకటరమణ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కాశీ నుంచి రాజమహేంద్రవరం రైలులో వచ్చారు. కపిలేశ్వరపురం వెళ్లడానికి కారు ఎక్కే క్రమంలో రెండు బ్యాగ్‌లను మెయిన్‌గేటు వద్ద ఆదమరుపుగా వదిలి వెళ్లిపోయారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు వాటి గురించి ఆరా తీయగా ఫలితం లేకపోయింది. దీంతో వాటిని స్టేషనుకు తీసుకొచ్చి బ్యాగ్‌లను పరిశీలించి ఆధార్ కార్డు ఆధారంగా వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. ఆయన టూటౌన్ స్టేషనుకు రావడంతో బ్యాగ్‌లను అప్పగించారు. ఓ బ్యాగ్‌లో రూ.81వేలు ఉన్నాయని, పోలీసుల దయవల్ల ఆ నగదు సురక్షితంగా దక్కిందని బాధితుడు పేర్కొన్నాడు. సీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా విధుల్లో నిబద్ధత చూపిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.



బ్యాగ్‌ని, అందులోని నగదును అందజేస్తున్న సీఐ శ్రీనివాసరావు

బాలికను వేధించిన కేసులో

యువకుడికి ఏడేళ్ల జైలు

అంబాజీపేట, మార్చి 12: బాలికను ప్రేమపేరుతో వేధించడంతో పాటు ఆ బాలిక ఫొటోలు మార్ఫింగ్ చేసి చంపుతానని బెదిరించిన యువకుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానాను కాకినాడ కోర్టు విధించిందని ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. అంబాజీపేట మండలానికి చెందిన బాలికను చప్పిడి అర్జున్ వేధిస్తూ చంపేస్తానని బెదిరించడంతో 2020 జూలైలో ఆ బాలిక నిందితుడిపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ షేక్ జానీబాషా ఆ యువకుడిపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాకినాడ కోర్టులో స్పీడ్ ట్ర యిల్ నిర్వహించారు. ఈకేసులో పీపీ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు నిందితుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసు దర్యాప్తులో కృషిచేసిన అప్పటి ఎస్ఐ షేక్ జానీబాషా, ట్రయల్‌లో కృషిచేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నేటి నుంచి కొవ్వూరులో 2 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

కొవ్వూరు, మార్చి 12: ఈ నెల 13వ తేదీ నుంచి కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా రెండు రైళ్లకు ప్రయోగాత్మక పరిశీలన కోసం హాల్ట్ కల్పిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. 17479-17480 తిరుపతి - పూరి ఎక్స్‌ప్రెస్, 17481-17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు బుధవారం నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆపనున్నారు. 17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు, 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. అలాగే 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు

గండేపల్లి, మార్చి 12: కాకినాడజిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ జాతీయరహదారిపై కట్టుదిట్టమైన, పటిష్టమైన భద్రతతో కలిగిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఉత్తర్వుల ప్రకారం గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది సహాయంతో చెక్‌పోస్టు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కాకినాడ జిల్లాకు సరిహద్దుగా మురారిలో ఏర్పాటు చేశామని సీఐ లక్ష్మణరావు వివరించారు. 24గంటలు నిరంతరం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తుంటారన్నారు.



మురారి హైవేపై అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటుచేసిన దృశ్యం

కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి

శివరాత్రి ఆదాయం రూ.10,43,545



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కె.గంగవరం, మార్చి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.10,43,545 ఆదాయం వచ్చింది. దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.5,70, 440, విరాళాలు ద్వారా రూ.55,400, హుండీల ద్వారా రూ.4,17,705 వచ్చినట్లు ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, ఈవో ఎం.శ్రీదేవి తెలిపారు. ట్రస్టుబోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు సమక్షంలో కానుకలను లెక్కించారు.

వైభవంగా వీరేశ్వరుని రథోత్సవం



మురమళ్ళ వీధుల్లో ఊరేగుతున్న వీరేశ్వరస్వామి.

ఐ.పోలవరం, మార్చి 12: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆసీనులైన వీరేశ్వరస్వామి మురమళ్ళ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కేరళ డప్పు వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణ, బుట్టబొమ్మల ఆటపాటలు, మిరుమిట్లుగొలిపే బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు జరిగింది. ఆలయం నుంచి మురమళ్ళ పుష్కరఘాట్ వరకు స్వామి వారి ఊరేగింపు జరిగింది. పుష్కరఘాట్‌వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, దాట్ల ఇంద్రరాజు, సర్పంచ్ కాలే రాజబాబు, కొలిశెట్టి గంగబాబు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు

కనుల పండువగా తెప్పోత్సవం

● గోదావరిమాతకు పంచహారతులు

● శివనామ స్మరణతో మార్మోగిన గోదావరి తీరం



వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారంరాత్రి మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం కన్నులపండవగా జరిగింది. పవిత్ర వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై ఆసీనులై వీరేశ్వరస్వామి నదీ విహారం చేశారు. స్వామి తెప్పోత్సవం కనులారా తిలకించిన భక్తులు శివనామస్మరణంతో పులకించారు. తొలుత ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు దంపతులు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గోదావరి మాతకు పంచహారతుల కార్యక్రమం జరిగింది.

దుర్గాడలో శ్రీపుష్పయాగం



దుర్గాడ శివాలయంలో శ్రీపుష్పయాగం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం, పాల్గొన్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 12: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు త్రిశూలస్నానం చేయించి శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు దంపత దాంబూలాలు అందజేశారు. అంతకు ముందు భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో..

రాయపూడి శ్రీనివాస్ ప్యానెల్ విజయం

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ గోదావరి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో రాయపూడి శ్రీనివాస్(ప్రవీణ్ శ్రీను) ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించగా పోలైన 1200 ఓట్లలో శ్రీనివాస్ ప్యానెల్ అత్యధిక ఓట్లు సాధించిందని, ఈ కమిటీ 2024-2027 కాలానికి పదవిలో ఉంటుందని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో రాయపూడి ప్యానెల్

రెండో వందేభారత్ పరుగులు



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలువద్ద ప్రయాణికుల సందడి

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ రైలు ట్రైల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.50గంటలకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు చేరుకొంది. రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు ఘన స్వాగతం పలికారు. రైలులో ట్రైల్ రన్ ఈవెంట్ సమన్వయాధికారి, విజయవాడ డీఈఎన్ ఎస్.రవికుమార్ వచ్చారు. ఈ రైలు 20708 నంబరుతో ఈనెల 13న విశాఖ నుంచి, 20707 ఈనెల 15న సికింద్రాబాద్ నుంచి ప్రతిరోజూ 8 బోగీలతో పరుగులు పెట్టనుంది. అన్నీ రిజర్వేషను బోగీలతో నడిచే ఈ రైలు ఉదయం 11గంటలకు (విశాఖవైపు), సాయంత్రం 4.38కి (సికింద్రాబాద్) రాజమండ్రి చేరుకుంటుంది. అలాగే సామర్లకోట ఉదయం 11.43గంటలకు, సాయంత్రం 4.03గంటలకు చేరుతుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోటలో ఆగుతుంది. అంతకు ముందు రాజమండ్రి రైల్వేస్టేషనులో ఏర్పాటుచేసిన వన్‌స్టేషన్- వన్‌ప్రొడక్టు స్టాల్‌ని ఉదయం 9.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐలు మావుళ్ళ, లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఇప్పటికే విశాఖ నుంచి సికింద్రాబాద్‌కి ఒక వందేభారత్ రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ రంగనాథ్, ఏడీఈఎన్ గణేషన్, సీసీఐ కళ్యాణ్, సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.



సామర్లకోట స్టేషన్లో వన్‌స్టేసన్ వన్ ప్రొడక్ట్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీ గీత

సామర్లకోటలో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం: ఎంపీ

సామర్లకోట, మార్చి 12: రైల్వే చరిత్రలో అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన రైళ్ళు వందేభారత్ రైళ్లు అని, అన్నివర్గాల ప్రజలకు ముఖ్యంగా విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య రాకపోకలు సాగించే వందే భారత్ రైలుకు సామర్లకోట స్టేషన్లో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం అని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మంగళవారం వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ పేరిట రైల్వే ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఎంపీ గీతావిశ్వనాథ్ ప్రారంభించా రు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ట్రయల్ రన్‌గా సామర్లకోట మీదుగా విశాఖ వెళ్లనున్నదనే సమాచారాన్ని ఎస్ఎస్ రమేష్ ద్వారా తెలుసుకున్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసేలా ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రితో పలు దఫాలు చర్చించినట్లు ఎంపీ గీతావిశ్వనాథ్ తెలిపారు. రైలు ప్రయాణీకు లకు నిరంతరం సేవలందించడంలోనూ సమాచారం అందివ్వడంలోనూ స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఎంపీ గీతావిశ్వనాథ్ రమేష్‌కు శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బీజేపీ నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖకు రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం సామర్లకో టకు చేరుకున్న రైలుకు సామర్లకోట రైల్వే స్టేషన్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పెద్దాపురం ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితర టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. నూతన రైలు ఇంజిన్‌వద్ద లాంఛనంగా ఎమ్మెల్యే చినరాజప్ప కొబ్బరికాయకొట్టి రైలు ఎక్కి సందర్శించారు. రైలు లోకోపైలట్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, చీఫ్ కమ్మర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, నోడల్ అధికారి దేవేంద్రస్వామి, నిమ్మకాయల రంగనాగ్, సామర్లకోట బీజేపీ నాయకులు వందే భారత్ రైలును తిలకించారు.



సామర్లకోటలో వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పాలిటెక్నిక్ కళాశాలలో యోగాపై అవగాహన

యానాం, మార్చి 12: యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ పి.వేలాయుదం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో అనిక్‌కుమార్ యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యాపకుడు జయవీరన్ విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వలం టీర్లు గోపాల్‌నగర్‌లో 50ఎకరాల మంచినీటి చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి చెరువును శుభ్రపరిచారు.

అన్నివర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



కొత్తపేట అభ్యర్థి బండారు సత్యానందరావు


ఆత్రేయపురం: వెలిచేరులో భవిష్యతి గ్యారంటీ కార్యక్రమంలో బండారు, రాయవరం: ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన ప్రజలు, కొత్తపేట: అవిడిలో సూపర్‌సిక్స్ పథకాలు గురించి వివరిస్తున్న గంటి హరీష్‌మాధుర్, బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, మార్చి 12: అన్ని వర్గాల అభివృద్ధే టీడీపీ అధినేత చంద్రబాబు ధ్యేయమని కొత్తపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వెలిచేరు, వద్దిపర్రుగ్రామాల్లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఆయా గ్రామాల్లో పలువురు వైసీపీని వీడి టీడీపీలోచేరారు. ఉమ్మడి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, ముఖ్య నాయకులు కరుటూరి సుబ్బారావు, పి.వుల్లంరాజువర్మ, జుజ్జవరపు హరిబాబు, మెర్ల రాము, మద్దింశెట్టి వీరవెంకట సత్యనారాయణపాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వంతో భరోసా

కొత్తపేట, మార్చి12: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అరాచక ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమని, టీడీపీ, జనసేన ప్రభుత్వంతో ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా కలుగుతుందని టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్ మాదుర్, కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం అవిడిలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వారిద్దరూ ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఇళ్లస్థలాల మెరకపేరిట వైసీపీ నాయకులు కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఊరి శివారు పనికిరాని స్థలాలను ఎంపికచేసి భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. టీడీపీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరికలు

రాయవరం, మార్చి 12: నదురుబాద గ్రామం నుంచి పలు కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. బండారు సత్తిబాబు, బండారు జోగారావు, పల్లి పవన్‌కుమార్, నిమ్మల రమణ, గుళ్లపల్లి దుర్గారావు, బండారు అప్పారావు, సాదే సత్యనారాయణ, బొమ్మత్తుల కిరణ్, గుత్తుల ప్రసాద్ టీడీపీలో చేరగా వారికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ వుండవిల్లి సుబ్బారాయుడు, ఉప్పలపాటి గంగాధర ప్రసాద్, కెల్ల అప్పారావు, జుత్తుగ గోపాలకృష్ణ, తేగల గోపీనాథ్, బడుగు విక్టర్‌బాబు, తిర్రు శోభన్‌బాబు, గుణ్ణం కనక మల్లేశ్వరరావు, కసిరెడ్డి సత్యనారాయణ, మత్తాబత్తుల దుర్గాప్రసాద్, వల్లు శ్రీనివాసరావ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అల్లవరం, మార్చి 12: జోడసకుర్రు శిష్టా అప్పన మెమోరియల్ జడ్పీ హైస్కూల్లో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 700మందికి కంటి పరీక్షలు జరిపి 400మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 80మందిని ఆపరేషన్ కోసం తరలించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఓఎన్జీసీ అసెట్ మేనేజరు గోవిందరాజన్, సీజీఎం ఇన్‌చార్జి ఆర్‌ఎస్ రామారావు, సీజీఎం (ప్రొడక్షన్) కె.సురేష్‌కుమార్, బి.రవిశంకర్, ఎం.సోమనాథ్, ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమ, అడపా శ్రీను, చింతా శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, ఐలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

300మందికి వైద్య పరీక్షలు

మామిడికుదురు, మార్చి 12: మామిడికుదురులో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 300మందికి నగరం పీహెచ్‌సీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని రాము, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మామిడికుదురు, మార్చి 12: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్ర మేనేజర్ ప్రసాదరావు, కార్మికశాఖ కమిషనర్ పి.నాగలక్ష్మి సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ మామిడికుదురు, మాకనపాలెం మంగళవారం గ్రామాల్లో ప్రదర్శన చేశారు. ఓటును అమ్ముకోవద్దంటూ నినాదాలు చేశారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రడ్యూసర్స్, నారియల్ భారత్ ప్రొడ్యూసర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన బూత్‌స్థాయి సమావేశాలు

అంతర్వేది, మార్చి 12: గుడిమూల, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో టీడీపీ-జనసేన బూత్ లెవెల్ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ సూపర్-6 క్యాలెండర్లను నాయకులు ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. జనసేన, టీడీపీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, మండలాధ్యక్షుడు గుబ్బల ఫణి, రాష్ట్ర నాయకుడు గెద్దం మహాలక్ష్మిప్రసాద్, పోతురాజు కృష్ణ, తాడి సత్యనారాయణ, ముప్పర్తి నాని, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో వార్షికోత్సవం

మండపేట, మార్చి 12: స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని డైరెక్టర్ ఇనపకోళ్ల గణేష్ ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులకు చదువుతో పాటు మానసిక పరిపక్వత, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ నూని శివప్రసాద్ అధ్యక్షత వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకుబహుమతులు అందజేశారు.

శాంతియుత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

అమలాపురం రూరల్, మార్చి 12: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో మంగళవారం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. ఇందుపల్లి, జనుపల్లి, సమనస గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరా కళాశాల విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, మార్చి 12: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విడుదలచేసిన మూడో సెమిస్టర్ ఫలితాల్లో అమలాపురం శ్రీవెంకటేశ్వరా కళాశాల విద్యార్థులు టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్ తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థి జె.కీర్తి 9.5 జీపీఏతో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఎస్‌కే బేగం 9.3, డి.పావని 9.1 జీపీఏ సాధించారు. వారితో పాటు 20మంది విద్యార్థులు 9.0నుంచి 9.5జీపీఏతో ఉత్తీర్ణులయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఏవో కరాటం ప్రవీణ్, డాక్టర్ హేమవిజిత తదితరులు అభినందించారు.

కేదార్లంకలో గడపగడపకు..

కపిలేశ్వరపురం, మార్చి 12: కేదార్లంకలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీని ఓడించండి



మామిడికుదురులో బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మామిడికుదురు, మార్చి 12: భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీని ఓడించాలంటూ దళిత సంఘ నాయకుల సమావేశం పిలుపునిచ్చింది. మామిడికుదురులోని భూపతి వెంకటపతి ఇంటి వద్ద దళిత సంఘాల నాయకుల సమావేశం నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం దళిత చైతన్యవేదిక, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, దళిత హక్కుల పోరాట సమితి, దళిత గిరిజన ఆదీవాసి సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో 400సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న బీజేపీ నాయకుల మాటలను తీవ్రంగా ఖండించారు. బీజేపీని ఓడించండి రాజాంగ్యాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. త్వరలోనే కార్యాచరణ కోసం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బొంతు మణిరాజు, కలిగితి పల్లంరాజు, బత్తుల మురళీకృష్ణ, దేవ రాజేంద్రప్రసాద్, చిలకపాటి శ్రీధర్, మట్టా సత్తిబాబు, బత్తుల జనార్ధనరావు, నీడిపూడి చంద్రరావు, నూటుకుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీలు



పదో తరగతి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న విద్యాశాఖాధికారి కమలకుమారి

అంతర్వేది, మార్చి 12: సఖినేటిపల్లి మండలంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు ప్రశ్నలువేసి జవాబు తెలుసుకున్నారు. కొంత మందిని బ్లాక్ బోర్డుపై రాయించారు. ప్రీఫైనల్ ప్రశ్నపత్రాలు పరిశీలించారు. తరగతి గదులు, ఎంఈవో కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పలువురు హెచ్‌ఎంలు, స్టాఫ్‌తో ముఖ్య విషయాలపై చర్చించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆమె మాట్లాడారు. సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, రిసోర్సుపర్సన్ గుబ్బల శ్రీనివాస్, ఎంఈవోలు పాఠశాల ప్రస్తుత పరిస్థితి అంతా సామాజిక తనిఖీ యాప్ నుంచి నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో ఇంప్రూమెంట్ ప్లాన్ తయారీపై తెలియజేశారు. ఇటీవల ఉపాధ్యాయుల టీఎల్ఎం మేళాలో పాల్గొని మొదటి, రెండు, మూడో బహుమతులు పొందిన ఉపాధ్యాయులకు ఆమె, సీఎంవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రసాదరాజు, కిశోర్‌కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

యానాం, మార్చి 12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని పరిపాలనాధికారి మునిస్వామి ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ శేరు నూకరాజు వలంటీర్లకు పలు అంశాలను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణాసుధాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాపేశ్వరం శ్రీచైతన్యలో కలర్స్‌డే

మండపేట, మార్చి12: తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం బ్లాక్అండ్ వైట్ కలర్స్‌డేను జరుపుకున్నారు. విద్యార్థులకు రంగుల వల్ల కలిగే ప్రయోజనాలు అధ్యాపకులు వివరించారు. ప్రిన్సిపాల్‌లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుండలేశ్వరానికి ఆర్టీసీసర్వీస్ పునరుద్ధరించాలి

కాట్రేనికోన, మార్చి 12: కుండలేశ్వరం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ దీనిపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు బస్సు సౌకర్యం లేక పాట్లు పడుతున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. గతంలో అమలాపురం నుంచి నేరుగా కుండలేశ్వరానికి బస్సు సర్వీసు ఉండేదన్నారు. భక్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కూళ్లలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

కె.గంగవరం, మార్చి 12: కూళ్లలో ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్దిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

అంతర్వేది, మార్చి 12: సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హడావుడిగా శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

అమలాపురం రూరల్, మార్చి 12: ఏ క్షణమైనా ఎన్నికల కోడ్ వస్తుందని భావించి అమలాపురం పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం హడావుడిగా శంకుస్థాపనలు, భూమి పూజలు నిర్వహించగా మరికొన్ని పనులను ప్రారంభించారు. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి జేలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, నాయకులు బొంతు గో

రహదారి నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు: వైసీపీ సర్పంచ్



పసుపల్లిలో నాసిరకం మెటీరియల్‌తో నిర్మించిన రహదారిని చూపిస్తున్న వైసీపీ సర్పంచ్ నాగరాజు

అంబాజీపేట, మార్చి 12: పసుపల్లిలో నాసిరకం మెటీరియల్‌తో రహదారి నిర్మిస్తున్నారని వైసీపీ సర్పంచ్ మట్టపర్తి నాగరాజు ఆరోపించారు. ఏఐబీ ప్రాజెక్టు నిధులు రూ.1.31 కోట్లతో ముక్కామల మడుపల్లి ఆర్అండ్‌బీ రహదారి నుంచి పెట్టావారిపేట మీదుగా ఇంజేవారిపేట వరకూ మూడు కిలో మీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈరహదారికి నాసిరకం మెటీరియల్ వాడుతున్నారని ఆయన ఆరోపించారు. రోడ్డు బేస్ లెవిల్ మెటల్ వేసిన నాటి నుంచి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా రోడ్డు వాటర్‌తో తడపలేదన్నారు. గతంలో 10అడుగులకు పైగా రోడ్డు ఉండగా ప్రస్తుతం 9అడుగులు నిర్మిస్తున్నారన్నారు. బెర్మ్‌ను మట్టితో వేస్తున్నారని కంకరతో నిర్మించాలని కోరారు. రహదారిని పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి




అంబాజీపేట: ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం, అల్లవరం: దేవగుప్తంలో పోలీసుల కవాతులో కమాండర్, ఎస్‌ఐలు

అంబాజీపేట, మార్చి 12: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, తహసీల్దారు జె.విమలకుమారి సూచించారు. అంబాజీపేటలోని కృషీవల కోకోనట్ ఫార్మరస్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో చైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం వద్ద చేరుకుని అక్కడ ఈవీఎంలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, నాయకులు బొంతు పెదబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, గుడాల ఫణి, అరిగెల బలరామమూర్తి, దొంగ నాగేశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమ, చిన్నం బాలవిజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కవాతు

అల్లవరం, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ దేవగుప్తం, డి.రావులపాలెం, గూడాల గ్రామాల్లో అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ కమాండర్ జేటీ జయరామ్ పర్యవేక్షణలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. దేవగుప్తం పంచాయతీ వద్ద మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధానల వెంకట్రావు అధ్యక్షతన ఎస్‌ఐ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, కుడుపూడి సూర్యప్రకాష్, పోతుల నాగరాజు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కవాతు

అంతర్వేది, మార్చి 12: సఖినేటిపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మోరి, మోరిపోడు, కేశవదాసుపాలెం, అంతర్వేదిల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం కోసం ఈకవాతు నిర్వహించినట్టు రాజోలు సీఐ గోవిందరాజు, సఖినేటిపల్లి ఎస్‌ఐ ఎస్.రాము చెప్పారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం టౌన్, మార్చి 12: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని, ప్రొటోకాల్ పాటించట్లేదని ఆరోపిస్తూ మంగళవారం అమలాపురం పట్టణ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు కలెక్టర్ హిమాన్సు శుక్లాను కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా ఆట వస్తువులను సైతం తమకు సమాచారం ఇవ్వకుండా పంపిణీ చేశారని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో కూడా అదేవిధంగా వ్యవహరించారన్నారు. సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు ఆశెట్టి నాగదుర్గ, పడాల శ్రీదేవి, యేడిద శ్రీను ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ

మలికిపురం, మార్చి 12: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వైఎస్సార్ చేయూత నాల్గో విడతలో మండలంలో 3822 లబ్ధిదారులకు రూ.7.16కోట్ల చెక్కును ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ రోజారమణి, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు, తహసీల్దార్ అనితకుమారి, ఏపీఎం డి.వరాలబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన చేయూత నాల్గో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వైఎస్సార్ నాల్గో విడత చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా ఏపీఎం కె.విజయ్, అధికారులు, వైసీపీ నాయకులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాజీనామాలు

అంతర్వేది, మార్చి 12: 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజోలు నియోజకవర్గ వైసీపీ ప్యానల్‌లో రాజీనామాల పర్వం మొదలైంది. ఎక్కడ చూసినా సోషల్ మీడియా వేదికగా మొదలైన రాజీనామాలు సఖినేటిపల్లి మండలం ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు బళ్ల నోబుల్‌ప్రభాకర్ మంగళవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు జిల్లా సీఈవోకి రాజీనామా పత్రం అందించారు. రాజోలు నియోజకవర్గంలో కొన్నిరోజుల నుంచి వైసీపీలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా రాజకీయాలపై విరక్తి చెందిన నా పదవికి రాజీనామా చేస్తున్నట్టు బళ్ల నోబుల్ తెలిపారు. వైసీపీ సోషల్‌మీడియా కోకన్వీనర్లు, కన్వీనర్లు రాజీనామా పత్రాలు అదే సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో రాజోలులో వైసీపీపై తీవ్ర వ్యతిరేకతతో పలు ప్రచార మాధ్యమాల్లో విమర్శలు వినబడుతున్నాయి.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బాయ్స్
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: బుల్లెట్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: రికార్డు బ్రేక్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ముమ్మిడివరం, మార్చి12: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఐ.విమల పేర్కొన్నారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈనెల23వరకు చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నగర పంచాయతీ బొక్కావారి పేటలో పోషణ పక్వాడా పథకం పక్షోత్సవాలు నిర్వహించారు. చిరు ధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే ఆహారాన్ని తల్లులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు, పాలు పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో గౌతమ్‌కు పతకాలు



అమలాపురం టౌన్, మార్చి 12: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ఆలిండియా పోలీసు వాలీబాల్ క్లస్టర్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జిల్లా స్పెషల్ పార్టీకి చెందిన కానిస్టేబుల్ యాండ్ర గౌతమ్ రాష్ట్రం తరపున ఐదు కాంస్య పతకాలు దక్కించుకున్నాడు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గౌతమ్‌ను ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, అడ్మిన్ సీతారాం, ఆర్ఎస్ఐలు దిలీప్‌చైతన్య, ఉదయభాస్కర్, ఏసుబాబుతో పాటు సహచర సిబ్బంది గౌతమ్‌ను అభినందించారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

మామిడికుదురు, మార్చి12: ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలంకలో రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి ఎమ్మెల్యే మంగళవారం భూమిపూజ చేశారు.జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ నెల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'విజయమే లక్ష్యంగా పనిచేయాలి'

కొత్తపేట, మార్చి 12: వైసీపీ అరాచక పాలనను అంతమొందించడానికి, టీడీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ క్లస్టర్ల సమావేశం మంగళవారం ఆయన అధ్యక్షతన జరిగింది. బూత్ కమిటీల పనితీరుపై సమీక్షించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ జడ్పీటీసీ దర్నాల రామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మీభాస్కరరావు, యల్లమిల్లి జగన్మోహన్, కముజు వెంకటేశ్వరరావు, అద్దంకి చంటిబాబు, దేవపాటి వెంకటేశ్వరరావు, బూసి మరియమ్మ, బండారు వెంకటసత్తిబాబు, గుబ్బల మూర్తి, ముద్రగడ ఫణి, సాయిప్రసాద్, రొట్టా రమణ తదితరుల పాల్గొన్నారు.

రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అంబాజీపేట, మార్చి 12:రహదారుల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మాచవరం దొమ్మేటివారి పాఎలంలో రూ.12లక్షతో నిర్మించే రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దారు కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, దొంగ నాగేశ్వరరావు, నాయకులు విత్తనాల శేఖర్, ఎం.ఎం. శెట్టి, నాగవరపు నాగరాజు, దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుపై అక్రమ కేసులు జగన్ కుట్రే'

రాజోలు, మార్చి 12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుపై అక్రమ కేసుల నమోదు సీఎం జగన్మోహన్‌రెడ్డి కుట్రలో భాగమేనని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ మండిపడ్డారు. ఈసందర్భంగా రాజోలులో మంగళవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజధానిలో అసైన్డ్ భూముల కేసులో చంద్రబాబు తదితరులపై చార్జిషీటు నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. దొంగే ఇతరులను దొంగా దొంగా అని అరుస్తున్నట్లుంది జగన్‌రెడ్డి వ్యవహారమని ధ్వజమెత్తారు. ఇడుపులపాయలో 700ఎకరాల అసైన్డ్ భూములను జగన్ స్వాధీనం చేసుకున్నది నిజం కాదా అని నిలదీశారు. సిద్ధం సభలు ఘోరంగా విఫలం కావడంతో జగన్‌కు దిక్కుతోచడం లేదన్నారు. దళితులపై అక్రమ కేసులు బనాయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిపై బురద జల్లడం, అక్కసు వెళ్లగక్కడం నిరంతర ప్రక్రియగా పెట్టుకున్నట్టు ఉందన్నారు. అసైన్డ్‌దారులైన దళితులను పట్టాదారులుగా మార్చి న్యాయం చేసింది చంద్రబాబు అయితే ఇళ్ల పట్టాల పేరుతో దళితుల అసైన్డ్ భూములు కాజేసిన దళిత ద్రోహి జగన్ అని ఆరోపించారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు

ఆత్రేయపురం, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు రావులపాలెం రూరల్ సీఐ ఎం.రామకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ర్యాలి గ్రామ ప్రజలకు భరోసా కల్పించారు. ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, పోలీసులు పాల్గొన్నారు.

అధ్యాపకుని ఆర్థికసాయంతో పుస్తకాలు అందజేత

ముమ్మిడివరం, మార్చి 12: ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ సి.చినసత్యనారాయణ సొంత ఖర్చులతో కెమిస్ట్రీ పుస్తకాలు సమకూర్చారు. వాటిని ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో హోమాలు

అల్లవరం, మార్చి 12: యెంట్రుకోన కాలువ గట్టు వద్ద నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో ప్రముఖ వేదపండితుడు సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో మంగళవారం హోమాలు, ప్రత్యేక పూజలు జరిపారు. బుధవారం పూర్ణాహుతి, ధ్వజస్తంభం, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

మోడరన్ విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 12: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ మూడో సెమిస్టరు ఫలితాల్లో రామచంద్రపురం మోడరన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జీవి రావు తెలిపారు. 9.9 నుంచి 9 గ్రేడ్ పాయింట్స్ 14మంది సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారన్నారు. విద్యార్థులను లయన్ జి.వి.రావు, ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టరు సాయిరామ్ చౌదరి, అధ్యాపకులు అభినందించారు.

ఆలయంలో భీమవరం ఎమ్మెల్యే పూజలు

అంతర్వేది, మార్చి 12: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీను కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం సుదర్శన హోమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వేదపండితులు శ్రీను దంపతులకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

ముమ్మిడివరం, మార్చి12: సీఎం జగన్ చేయూత పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరంలో మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన చేయూత చెక్కు విడుదల కార్యక్రమంలో నియోజకవర్గంలో 17,785మంది లబ్ధిదారులకు రూ.33.35కోట్లచెక్కును ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, నడింపల్లి సూరిబాబు, హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, ఎంపీపీలు కోలా గంగాభవానీ, మిరియంజ్యోతి, జడ్పీటీసీలు కుడుపూడి శంకరరావు, నేల కిశోర్‌కుమార్, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్‌సాగర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, మార్చి 12: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వాడపల్లికి చెందిన మెర్ల రాంబాబు-పద్మజ దంపతులు రూ.50వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా మంగళవారం ఒక్కరోజు ఆదాయంరూ.1,67,292 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

హుండీల కానుకలు లెక్కింపు

అల్లవరం, మార్చి12: నక్కా రామేశ్వరంలోని పార్వతీ రామేశ్వరస్వామి ఆలయంలో హుండీలను మంగళవారం తెరిచారు. చొల్లంగి అమావాస్య నుంచి మహాశివరాత్రి వరకు భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.1,28,814 ఆదాయం లభించింది. చైర్మన్ అంగాని రామారావు, దేవదాయ శాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ఈవో సలాది సత్యమహేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 12: వైసీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వైసీపీ కార్యాలయం వద్ద వైసీపీ జెండాను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆవిష్కరించారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీధర్ పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: పలుగ్రామాల్లో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కేదార్లంకలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

మండపేట: స్థానిక రాజారత్నసెంటరులో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సారథ్యంలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. తోట కేక్ కట్‌చేశారు. ఏడిద, కేశవరం, ద్వారపూడి గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

అంబాజీపేట, మార్చి12: గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీవో వై.విజయశ్రీ అన్నారు. పోషన్ పక్వాడాలో భాగంగా మాచవరం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు 10రకాల పోషకాహార కిట్లను అందించారు. అంగన్‌వాడీ టీచర్ బి.ఎ.ఆశాలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.